# సింగిల్ పేజీ కథలు

ఎనిమిది గంటలు కావడానికి యింకా ఐదు నిమిషాల టైముంది. కాలింగ్ బెల్ నొక్కిన పది సెకన్లలోనే తలుపులు తెరుచుకున్నాయి. ఆ వెనుక నిలబడి వున్న ఆమె..నందిని. కనుల నిండా వెలుగుతో, ముఖమంతా అలుముకున్న ఆశ్చర్యంతో..ఒకింత అపనమ్మకంతో.

ఆమె మనసులోని భావాలను నేను గ్రహించగలను. కారణం- పెళ్ళయిన ఈ మూడేళ్ళలో..ఆదివారం తప్ప మిగతా రోజుల్లో ఏనాడూ నేను ఈ సమయానికి యింటికి రాలేదు. ఈరోజు రావలసి వచ్చింది. నా మనసుని తేనె తుట్టెలా పట్టి పీడిస్తున్న 'ఆ' అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలంటే..తప్పదు.

కొన్ని సంఘటనలు యాదృచ్ఛికంగా జరిగిపోతుంటాయి. అలా జరిగే ఏ ఒక్క సంఘటనో, కొన్ని దీర్ఘకాల సమస్యలకి పరిష్కారం చూపుతాయి.

నిన్న సాయంత్రం జరిగిన సంఘటన గురించి చెప్పే ముందు ఓ రెండు నెలలు వెనక్కి వెళ్లాలి.

"డాక్టర్ రవిచంద్ర..ఎమ్.డి."

"మీ నేమ్ ప్లేట్ చూస్తే చాలు మా రుగ్మతలు సగం నయమైపోతాయి డాక్టరు గారూ" అంటుంటారు నా దగ్గరికి ట్రీట్‌మెంట్‌కి వచ్చిన వాళ్ళు. అందులో నా గొప్పదనం ఏమీ లేదు. పేషంట్‌కి కావలసింది డాక్టరుపై నమ్మకం. నానుండి వారు దాన్ని పొందుతున్నారు.

పి.జి. పూర్తయ్యాక స్వంతంగా క్లినిక్ పెట్టిన ఈ ఐదేళ్ళలో నేను ఎంతోమంది చేత దేవుడిగా ఆరాధింపబడుతున్నానంటే కారణం డబ్బుకోసం వెంపర్లాడని నా మనస్తత్వం. రోగి ఆర్థిక స్థోమతకి విలువనిచ్చి, అవసరమైతే తోడ్పడే గుణం.

రెండు నెలల క్రితం..చాలా బిజీగా వున్న సమయంలో వచ్చాడు రాజారావు. ఓ పేషెంటుగా కాదు కాదు..ముగ్గురు పేషంట్లుగా..కారణం అతడితోపాటు అతని భార్య, కొడుకు వున్నారు.

అతడు నేనూ ఇంటర్మీడియట్ వరకు క్లాస్‌మేట్స్‌మి. నేను మెడిసిన్‌లో చేరాక టచ్ తగ్గిపోయిందిగానీ, అతడు డిగ్రీ చేసి ఎక్కడో టీచర్‌గా చేరాడని మాత్రం తెలుసు. మనిషిని చూడడం మాత్రం దాదాపు పది, పన్నెండేళ్ళ తర్వాత..ఇదిగో..ఇదే.

వచ్చిన ఆ ముగ్గురి కళ్ళల్లో జీవకళ ఏమాత్రం లేదు. మొహాలు పీక్కుపోయి, చీకట్లో దెయ్యాన్ని చూసి జడుసుకున్న పిరికివాళ్లల్లా వున్నారు.


చాలా చిత్రమైన సమస్య వారిది. తరచి చూస్తే ముగ్గురిదీ ఒకటే ప్రోబ్లమ్.

ఒక ఉపాధ్యాయుడిగా చాలా క్రమబద్ధమైన జీవితం వాడిది. ఉదయం లేచింది మొదలు, రాత్రి నిద్ర కుపక్రమించేవరకు ఒక టైమ్ టేబుల్ లాగా క్రమశిక్షణని పాటిస్తున్నాడని మాటల ద్వారా అర్థమైంది.

నిజానికి అతడు చాలా అదృష్టవంతుడే. అనుకూలవతియైన భార్య, అనురాగాలు పంచే ఎనిమిది సంవత్సరాల కొడుకు, అందమైన జీవితం..ఎంతో ప్లాన్డ్‌గా సాగిపోవలసిన తరుణంలో..

## సమస్య చిన్నదే!

మూడు నెలలుగా ముగ్గురిలో విచిత్రమైన మార్పు. రాత్రిళ్ళు తిండి సహించకపోవడం..బలవంతాన తిన్నా వాంతులు, అజీర్ణం, వికారం..కేవలం రాత్రి భోజనంతోనే




ఈ తంటా..పోనీ..ఆకలి లేదా అంటే..వేళకి ఆకలి నార్మల్‌గానే వుంటుంది.

ఇద్దరు ముగ్గురు డాక్టర్‌లని కలిసినా లాభం లేకపోయిందిట. ఆఖరికి, నా గురించి ఎవరో చెబితే, మొహమాటపడుతూనే వచ్చాడు.

అతడి సమస్యేమిటో నాకూ అంతు చిక్కలేదు. ఆ వారంలో మొత్తం మూడుసార్లు వచ్చాడు. అతడు తీసుకునే ఆహారం, అది తయారుచేసే విధానం..ఎన్ని మార్పులు చేసినా సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి లాగానే వుంది.

ఇది నా మెదుడును దొలిచేస్తున్న సవాల్..రెండు నెలలుగా..

అయితే..

నిన్న సాయంత్రం. ఎనిమిది, పది సమయాన-

హాల్లో తన టర్న్ కోసం ఎదురు చూస్తున్న పేషంట్ ఒకరు హఠాత్తుగా క్రిందపడి విపరీతంగా వాంతులు చేసుకుంటున్నాడని నర్స్ గాభరాగా వచ్చి చెబితే, పరుగున వెళ్ళాల్సొచ్చింది.

నిజమే...ఫీవర్ పేషంట్..చేయాల్సిన సపర్యలు గురించి బాయ్స్‌కి సూచనలిస్తూ చాలా కాజువల్‌గా గమనించాను. 'రక్తం'..అది యాధృచ్ఛికం..ఓ డాక్టర్‌గా రక్తం నాకు కొత్తకాదు. అయినా నాలో ఏదో చలనం..అవును యాదృచ్ఛికం..పేషంట్ల తాకిడి ఎక్కువగా ఉండడంతో అక్కడితో విషయాన్ని మరిచిపోయాను.

★ ★ ★

ఈరోజు..క్లినిక్‌లో వుండగా ఎందుకో రాజారావు గుర్తుకొచ్చాడు. నామీద కూడా ఆశలు వదిలేసుకున్నట్లున్నాడు. గత పది రోజులుగా కనబడటమే లేదు. మరుక్షణం..నిన్నటి సంఘటన మెదిలింది. మైగాడ్..రెండింటికీ ఎక్కడో చిన్న మెలిక. నా అనుమానం నిజమైతే మరోసారి రాజారావు దినచర్యని గుర్తు తెచ్చుకున్నాను. ఫైనల్ కన్‌ఫర్మేషన్ కోసం, వెంటనే క్లినిక్ వదలి యింటికి వచ్చాను.

ఎనిమిది గంటలు కావడానికి యింకా ఐదు నిముషాలు టైముంది.

నేను యింటి దగ్గర నందిని యింకా నమ్మలేకపోతోంది.

"భోజనం పెడతావా! క్విక్..మధ్యాహ్నందైనా సరే.." అంటూ షూ విడిచి చేతులు కడుక్కుని, డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చున్నాను.

హాల్లో టీవీలో ఏదో సీరియల్ ఆ రోజు భాగం అయిపోయినట్టుంది. టైటిల్స్, పాట వస్తున్నాయి. నేను క్లినిక్‌లో రాత్రింబగళ్ళు కష్టపడుతుంటే, నందినికి కాలక్షేపాన్నిచ్చే ప్రియసఖి యిదే..

'తొందరలోనే తనకో పాపనో, బాబునో ఇవ్వాలి' మనసులో ఖాయంగా అనుకున్నాడు.

"ఏమిటి కంగారు...ఏ సెమినార్‌కో మళ్ళీ అర్జంటుగా, రాత్రి ట్రెయిన్‌కే బయల్దేరాలా!" అంది నందిని వడ్డిస్తూ. తనూ వడ్డించుకుంటూ..నాతో కలిసి భోంచేయడమే తనకి చాలా యిష్టం.

వంట ఎప్పటిలాగే అద్భుతంగా వుంది. నాలుగు ముద్దలు తిన్నానో లేదో-

"విస్ఫోటనం"

తుళ్ళి పడ్డామిద్దరం..ఎదురుగా ఖండఖండాలుగా మానవ శరీరావయవాలు..ముద్దలు ముద్దలుగా రక్త

మాంసాలు. శరీరంలోంచి బైటపడి యింకా జీవంతో కొట్టుకుంటున్న గుండె, ఊపిరితిత్తులు, కాలేయం..వగైరా..తలలు పగిలి, నడుము విరిగి గిజగిజ లాడుతున్న ప్రాణాలు.

ఆనాడు కళింగ యుద్ధభూమిని దర్శించి అహింసా వాది అయిన అశోకుడు, ఈనాటి దృశ్యాల్ని చూసివుంటే, అక్కడికక్కడే ప్రాణ త్యాగం చేసేవాడేమో.

నా కడుపులోనూ ప్రేగులు మెలితిరిగాయి డాక్టర్నైన నాకే..అలాంటిది?

నా అంచనా కరెక్టే. రాజారావు సమస్య అర్థమైంది. పరిష్కారం తన చేతిలో పని. అతడు తను డిన్నర్ టైమ్‌ని మార్చాలి. వీలైతే ఆ సమయంలో టీవీని ఆన్ చేయకూడదు. న్యూస్ చూడకూడదు.

ఎందుకంటే, ఒకరిని మించి ఒకరు సమాచారాన్ని క్షణాల్లో ప్రజల ముందుంచాలనే వెర్రి వ్యామోహంలో, హింసని కూడా లైవ్ కవరేజ్ ద్వారా విశృంఖలంగా నైతిక విలువలకి తిలోదకాలిచ్చేసి ప్రసారం చేస్తున్న ఈ వార్తాకథనాలు సభ్య సమాజానికి ఎంత మేలు చేస్తాయో, ఓ బాధ్యత గల బిడ్డగా, సోదరుడిగా, తండ్రిగా, పౌరుడిగా ప్రతి మీడియా అధినేత సమీక్షించుకున్న నాడు మాత్రమే, రాజారావులాంటి వారికి పట్టిన టెక్నాలజీ శని కొంతయినా వదులుతుంది.

సర్వేజనాస్సుఖినో భవంతు!

**-సి.వి.నరసింహదాసు (కోల్‌కటా)**

# పుణ్యానికి పోతే...

గుంటూరు బస్‌స్టేషన్ ప్రయాణీకుల్తో రద్దీగా ఉంది. ప్రయాణీకులు అటు ఇటు హడావుడిగా తిరుగుతున్నారు. బస్సు రాగానే తమ సామాన్లతో బస్సెక్కడానికి ప్రయాసపడుతున్నారు.

సుబ్బారావు ఏదో చెక్ మార్చుకోడానికి గుంటూరు వచ్చి, క్యాష్ భద్రంగా బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకొని, తిరిగి వాళ్ళ ఊరెళ్ళడానికి బస్‌స్టేషన్‌కు వచ్చి, బస్సుకోసం ఎదురు చూడసాగాడు. ఇంతలో వాళ్ళ ఊరికి వెళ్ళే బస్సు వచ్చి పాయింట్‌లో ఆగింది. సుబ్బారావు నింపాదిగానే బస్సెక్కి కిటికీ పక్క సీట్లో కూర్చుని, బ్రీఫ్‌కేస్ వళ్ళోనే పెట్టుకొని తెలిసినవాళ్ళు ఎవరైనా ఉన్నారేమోనని బస్సంతా ఒకసారి చూశాడు కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ.

ఇంతలో ఒకతను రెండు పెద్ద అట్టపెట్టెల్ని బస్సులోకి తీసుకొచ్చి ముందుభాగంలో డ్రైవర్ పక్కనే పెట్టించాడు. ఆ రెండు పెట్టలకు లగేజి టిక్కెట్లు కొట్టించి, ఆ టిక్కెట్లను తెలిసిన వాళ్ళకు ఇచ్చి, తాను దిగి వెళ్ళిపోవాలని, తెలిసిన వాళ్ళ కోసం బస్సంతా గాలించాడు. ఒక్కడూ తెలిసినవాడు అతనికి కనిపించలేదు. ఆ టిక్కెట్లను కండక్టర్‌కే ఇవ్వబోయాడు. కండక్టర్ తీసుకోకపోవడంతో ప్రయాణీకులకే ఎవరికైనా ఇవ్వాలనుకున్నాడు.

"ఏమండీ! ఈ టిక్కెట్లు మీ దగ్గరుంచుకోండి. ఫలానా ఊళ్ళో మా వాళ్ళు వస్తారు. వాళ్ళు అక్కడ యీ పెట్టెల్ని దించుకుంటారండీ! దయచేసి ఈ సాయం చెయ్యండి" ఒక పెద్దాయన్ను బతిమిలాడాడు సుబ్బారావు.

"నాకు కుదరదండీ! ఇంకెవరికైనా ఇవ్వండి" తల తిప్పుకున్నాడు పెద్దాయన.

"ఏమండీ! మీరు...సార్! మీరైనా!" ప్రాధేయపడ్డాడు.


ఆడవాళ్ళను కూడా అడిగి చూశాడు. కానీ ఎవరూ ఆ పెట్టెల బాధ్యత స్వీకరించలేదు.

ఇదంతా చూస్తూనే ఉన్నాడు సుబ్బారావు. అతని మీద జాలేసింది సుబ్బారావుకు.

"బొత్తిగా మానవత్వం లేకుండా పోతోందండీ మనుషులకు. ఆ టిక్కెట్లను జేబులో పెట్టుకుంటే నష్టమేంటండీ? అదేమైనా బరువా మొయ్యడానికి. ఈరోజుల్లో హెల్పింగ్ నేచర్ అనేదే మరుగై పోతోందండీ!" ప్రక్కసీట్లో కూర్చున్నాయనతో అంటున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు మాటల్ని విన్నాడేమో అతను సుబ్బారావు దగ్గరికి వచ్చి "సార్! మీరైనా యీ టిక్కెట్లు దగ్గరుంచుకోండి సార్! ఫలానా వూళ్ళో మా వాళ్ళు వచ్చి యీ పెట్టెలు దింపుకునిపోతారు సార్! ప్లీజ్" అంటూ టిక్కెట్లు చూపిస్తూ అర్థించాడు.

"ఇలా ఇవ్వండి!" అంటూ టిక్కెట్లు తీసుకొని జేబులో పెట్టుకొంటూ ఒక్కసారి సగర్వంగా బస్సంతా చూశాడు సుబ్బారావు.



సుబ్బారావుకు థ్యాంక్స్ చెప్పి దిగి వెళ్ళిపోయాడు అతను.

బస్సు నగర శివార్లు దాటి క్రమంగా వేగం పుంజుకొంది. పది నిముషాలు ప్రయాణించిందో లేదో, ఒక యస్సై ఇద్దరు కానిస్టేబుళ్ళతో జీప్‌లో వచ్చి, బస్సును క్రాస్ చేసి చెయ్యెత్తి బస్సాపి బస్సులోకి ఎక్కాడు. బస్సును ఆపేయమన్నాడు. బస్సును ఆపేశాడు డ్రైవర్.

యస్సై, ముందున్న రెండు అట్టపెట్టెల్ని చూపించి "కండక్టర్! ఈ అట్టపెట్టెలు ఎవరివి?" ప్రశ్నించాడు.

"సార్! వాటికి సంబంధించిన లగేజి టిక్కెట్లు..అరుగో..వారి దగ్గర ఉన్నాయండి!" అంటూ సుబ్బారావును చూపించాడు కండక్టర్.

యస్సై, సుబ్బారావు దగ్గరికి వచ్చి "ఆ పెట్టెలు మీవేనా?" ప్రశ్నించాడు.

"పెట్టెలు నావి కావు సార్! ఎవరో ఒకతను పెట్టెలు అక్కడ పెట్టి లగేజి టిక్కెట్లు నా చేతికి ఇచ్చి వెళ్ళాడు సార్!" వినయంగా చెప్పాడు సుబ్బారావు.

"నో! ఆ పెట్టెలు మీవే..వాటిలో ఏమున్నాయో చూపించండి! వాటిలో బాంబులున్నట్లు మాకు సమాచారం అందింది. చూపించండి ముందు" గద్దించాడు యస్సై.

"నావి కాని పెట్టెలు నేనెలా తెరిచేది సార్!"

"ఎలానా? ఇలా.." అంటూ సుబ్బారావును పెట్టెల దగ్గరికి లాక్కెళ్ళి అందరి సమక్షంలో పెట్టెలు తెరిపించాడు యస్సై. వాటిలో నిజంగానే బాంబులున్నాయి.

"ఏరా! ఈ బాంబులు ఎక్కడికి సరఫరా చేస్తున్నావ్? ఎవరు నీ చేత పంపించారు? మీ ముఠానాయకుడు ఎవరు? ఈ బ్రీఫ్ కేస్‌లో ఏమున్నాయో తియ్!" అంటూ లాఠీతో ఒక దెబ్బ వేశాడు యస్సై.

సుబ్బారావు బ్రీఫ్‌కేస్ తెరిచాడు. అందులో తనవే లక్ష రూపాయలు ఉన్నాయి.

"ఈ డబ్బు ఎవరిచ్చారురా! నీకు?" అంటూ సుబ్బారావు చెప్పే మాటల్ని వినిపించుకోకుండా బ్రీఫ్‌కేస్, బాంబుల పెట్టెలతో సహా సుబ్బారావును జీప్‌లో ఎక్కించి పోలీస్ లాకప్‌లో పడేశాడు యస్సై.

"పుణ్యానికి పోతే పాపం ఎదురు కావడమంటే ఇదేనేమో?" అంటూ ముక్కుల మీద వేళ్ళేసుకున్నారు ప్రయాణీకులు.

**-దిట్టకవి శ్రీనివాసాచార్య (ఎర్రగొండపాలెం)**